సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం, 8, జూన్, 2024



సోమశిలలో 7.272 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 7.272 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్‌డెల్టాకు 200, ఉత్తరకాలువకు 5, దక్షిణకాలువకు 5 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,690
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,686
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,887
నవర (8 గ్రాములు)	రూ.55,096

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.6 /25.9

వాతావరణంలో తేమ 54 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా శనివారం కొన్ని మండలాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి జల్లులు కురుస్తాయని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఏపీ రెసిడెన్షియల్స్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): జిల్లాలోని ముస్లిం మైనార్టీలు ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో చేరేందుకు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ముస్లిం మైనార్టీ విద్యార్థులు నేరుగా 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యనభ్యసించేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో నేరుగా ఇంటర్మీడియట్‌లో మొదటి సంవత్సరం అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆయా కళాశాలలు పాఠశాలల ప్రిన్సిపల్స్‌కు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో, కళాశాలల్లో చేరబోవు మైనార్టీ విద్యార్థులు ఆయా పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించాలన్నారు. అడ్మిషన్ కోసం పాఠశాలల్లో ఈ నెల 12వ తేదీ, కళాశాలల్లో ఈ నెల 18వ తేదీ తుది గడువని తెలిపారు. మైనార్టీ విద్యార్థులందరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 331

కలిగిరి: కలిగిరి వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్టంగా రూ.331 ధర లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 1,035 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 847 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 188 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్టంగా రూ. 331, కనిష్టంగా రూ. 205 ధర లభించగా, సగటున కిలో పొగాకుకు రూ. 281.93 ధర లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 878 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం 878 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 947 బేళ్లు రాగా వాటిల 878 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 1,05,850 కిలోల పొగాకును విక్రయించగా రూ.3,01,61,555 వ్యాపారం జరిగింది. గరిష్టంగా కిలోకు రూ.330, కనిష్టంగా రూ.204 ధర లభించింది. మొత్తం మీద సగటు ధర రూ.284.95గా నమోదైంది. వేలంలో 24 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సైలుగా పదోన్నతి

నెల్లూరు సిటీ: ఏఎస్సైలుగా విధులు నిర్వహిస్తున్న ఏడుగురికి ఎస్సైలుగా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం సౌత్ కోస్టల్ జోన్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. తిరుపతిలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బీ వెంకటేశ్వర్లుకు ఎస్సైగా పదోన్నతి కల్పిస్తూ నెల్లూరుకు కేటాయించారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 27 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 62,161 మంది స్వామి వారిని దర్శించుకోగా 28,923 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.35 కోట్లు సమర్పించారు. టైమ్‌స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు నిర్దిష్ట సమయంలో, టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో, ప్రత్యేక టికెట్లు కలిగిన భక్తులకు రెండు గంటల్లో దర్శనం లభిస్తోంది.

అయ్యో.. రొయ్య

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గణనీయంగా పెరిగిన ధరలు

- నాణ్యమైన సీడ్, ఫీడ్ రైతులకు అందుబాటులో ఉంచడం
- సీడ్, ఫీడ్‌ల ధరలను నియంత్రించడం
- సిండికేట్ల నుంచి కాకుండా నేరుగా రైతులే రొయ్యలను అమ్ముకునే విధంగా చర్యలు
- ఎగుమతులపై ప్రత్యేక దృష్టి సారించిన వైనం
- తాజా ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఆరంభం నుంచి ఆక్వా మార్కెట్ అతలాకుతలం
- ఆరు నెలల్లో 30 కౌంట్ కేజీపై రూ.170. వంద కౌంట్‌పై రూ.60 తగ్గుదల



రొయ్యల ధరలు

కౌంట్	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో		రెండు నెలల క్రితం	ప్రస్తుతం
30	450	590	430	420
40	400	480	330	320
50	360	405	290	280
60	340	370	270	260
70	300	340	250	240
80	260	300	230	220
90	230	270	220	210
100	210	260	210	200

జిల్లాలో ఆక్వా రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. గడిచిన ఆరు నెలల్లో వివిధ కౌంట్‌ల రొయ్యల ధరలు దారుణంగా పతనమయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు రొయ్యలకు ధరలు లేక రైతులు విలవిల్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఆక్వా రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. రైతులకు నాణ్యమైన సీడ్, ఫీడ్‌ను అందించడంతో పాటు సీడ్, ఫీడ్‌ల ధరలను నియంత్రణకు చర్యలు చేపట్టారు. రైతుల నుంచి నేరుగా రొయ్యలను ఆక్వా ఎగుమతిదారులు కొనుగోలు చేసే విధంగా నిబంధనలు తెచ్చారు. కరోనా వంటి కష్టకాలంలోనూ ఎగుమతులపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

సాక్షి, ప్రతినిధి, నెల్లూరు: గతంలో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిన ఆక్వా రైతులు దశాబ్దన్నర కాలంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటూనే ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆక్వా రైతులు కొంత మేర నిలదొక్కుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచి ఆక్వా మార్కెట్‌పై సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయారు. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అన్ని కౌంట్లపై టన్నుకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల మేర పెరిగాయి. ఆ తర్వాత క్రమక్రమంగా ధరలు తగ్గుముఖం పట్టాయి. ఏ స్థాయిలో పెరిగాయో అదే స్థాయిలో ధరలు తగ్గిపోయాయి. తాజాగా రెండు నెలల్లో టన్నుకు మరో రూ.10 వేల వంతున తగ్గిపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో దాదాపు 169 కిలో మీటర్ల తీర ప్రాంతం ఉంది. కేవలం తీర ప్రాంతాల్లోనే కాకుండా కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం వంటి కొన్ని మండలాల్లో కూడా ఆక్వా సాగు ఆశాజనకంగా ఉండడంతో జిల్లాలో దాదాపు 20 మండలాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 30 వేల హెక్టార్లలో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రలో ఆక్వా రైతుల కష్టాలను తెలుసుకుని, అధికారంలోకి వచ్చాక ఆక్వా రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆక్వా రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ప్రధానంగా నాణ్యమైన సీడ్, ఫీడ్‌ను రైతులకు అందించేందుకు ప్రత్యేకంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేయించి టెస్టింగ్ తర్వాతనే రైతులకు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. అడ్డూఅదుపు లేకుండా పోతున్న సీడ్, ఫీడ్ ధరలను నియంత్రించారు. రొయ్యలకు గిట్టుబాటు ధరలు ఉండేలా చర్యలు చేపట్టడంతో పాటు ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులపై దృష్టి సారించారు. దీంతో ఆక్వా రంగానికి మళ్లీ పూర్వ వైభవం వచ్చినట్లుగా రైతులు సంతోషించారు.

సంక్షేమంతోపాటు.. ఎగుమతులపై దృష్టి

ఆక్వా సాగు రైతుల స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆక్వా జోన్ ఏర్పాటు చేసి ఆక్వా విద్యుత్ కనెక్షన్లకు మాత్రం యూనిట్‌కు రూ.1.50లకే సరఫరా చేశారు. అయితే చాలా మంది రైతుల కనెక్షన్లు ఆక్వా కనెక్షన్లు కాకుండా కమర్షియల్ వాటికి మాత్రమే కమర్షియల్ రీడింగ్ రేట్లు వర్తిస్తున్నాయి. వీటిని ఆక్వా రైతులు చాలా మంది కన్వెర్షన్ చేసుకోలేదు. ప్రధానంగా ఆక్వా సాగుకు సంబంధించి రిజిస్టర్ చేసుకోవాల్సి ఉండడంతో రైతులు ఆ ప్రక్రియ చేయాల్సి వస్తుందని.. కనీసం విద్యుత్ కనెక్షన్లు కూడా కన్వెర్షన్ చేసుకోలేదు. విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు, నాణ్యమైన సీడ్, ఫీడ్‌లపై దృష్టి పెట్టడంతో ఆక్వా సాగులో మంచి దిగుబడులు పెరిగాయి. పండగల సీజన్‌ల్లో రొయ్యలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఏర్పడడంతో జిల్లా నుంచి భారీగానే రొయ్యలు ఎగుమతి జరిగింది. కరోనా సమయంలో ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులపై ఆంక్షలు విధించారు. ఆ సమయంలో ఆక్వా రైతులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో కేంద్రంతో చర్చించి ఆక్వా ఉత్పత్తులు ఎగుమతులకు అనుమతులు సాధించారు. అదే సమయంలో ధరలు ఉండేలా నేరుగా ఆక్వా ఉత్పత్తులు ప్రాసెస్ చేసి, ఎగుమతులు చేసే సంస్థలే కొనుగోలు చేయాలని నిబంధనలు విధించారు.



అప్పుడు ధరలు పైపైకి.. ఇప్పుడు కిందకు..

గతంలో ధరలు పైపైకి వెళ్లినా.. కొంత కాలంగా కింద చూపులు చూస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాక ముందు 30 కౌంట్ రూ.300 లోపే ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. 30 కౌంట్ రొయ్యలు రూ.450 వరకు పెరగ్గా.. ఆ తర్వాత రూ. 590 చేరింది. ఇలా దశల వారీగా టన్నుపై దాదాపు రూ.3 లక్షల వరకు పెరిగింది. అయితే ఆరు నెలల క్రితం టన్నుకు రూ.1.60 వరకు ధరలు పడిపోయాయి. ప్రధానంగా వివిధ కౌంట్‌లకు రూ.50 వేల నుంచి రూ.లక్ష, రూ.లక్షన్నర వరకు పతమయ్యాయి. తాజాగా రెండు నెలల్లో మరో రూ.10 వేల వరకు పడిపోయింది.

గిట్టుబాటు ధర ఉండేది



గతంలో రొయ్యల పంట అనుకూలంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్వా రైతులు కొంత మెరుగుపడ్డారు. అప్పటి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో దళారులు గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేశారు. కొద్ది నెలలుగా మత్స్యశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్రస్తుతం రొయ్యలు సాగుకు పెట్టుబడులు పెరిగిపోయాయి. గతంలో ఉన్న ధరలు సైతం తగ్గిపోవడంతో పంట చేతికి వచ్చినా ధరలు తగ్గడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తోంది.

– ఎం. సంతోష్‌గౌడ్, గంగపట్నం, ఆక్వారైతు

ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్‌పర్సన్ పదవికి సుప్రజ రాజీనామా





ఆధునికీకరించిన సింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్, బత్తుల సుప్రజ రెడ్డి

సింగరాయకొండ: ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్‌పర్సన్ పదవికి బత్తుల సుప్రజరెడ్డి రాజీనామా చేశారు. శుక్రవారం ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. తనపై నమ్మకం ఉంచి తనకు ఈ అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, తనకు సహకరించిన ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తాను చేసిన పలు అభివృద్ధి పనులను వివరించారు. సింగరాయకొండలో ఆర్టీసీ బస్టాండ్‌ను సుమారు రూ.72 లక్షల అంచనా వ్యయంతో ఆధునికీకరించడంతో పాటు అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణం, మరుగుదొడ్లు, క్యాంటీన్ ఆధునికీకరణ చేశామన్నారు. ప్రజల సౌకర్యార్థం పాకల నుంచి సింగరాయకొండకు నూతన బస్సు సర్వీసు ఏర్పాటు, పొదిలి నుంచి వేమవరం మీదుగా కనిగిరికి బస్సు సర్వీసు, కందుకూరు నుంచి రావులకొల్లు చుట్టుపక్కల గ్రామాల మీదుగా హైదరాబాద్‌కు బస్సు సర్వీసు, సింగరాయకొండకు దూరప్రాంత బస్సు సర్వీసులు వచ్చేలా కృషి చేయడం, పలు గ్రామాలకు స్కూలు విద్యార్థుల సౌకర్యార్థం బస్సు ట్రిప్పులు వేయడం చేశామన్నారు. కందుకూరు, ఒంగోలు, నెల్లూరు డిపోల నుంచి హైదరాబాద్‌కు నూతన బస్సులు ప్రారంభించడం, జోన్ పరిధిలోని ఆర్టీసీ డిపోల పరిధిలోని సమస్యలను పరిష్కరించడం జరిగిందని వివరించారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

- ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి
- ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషిస్తాం
- ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తూమాటి

కందుకూరు: ఎన్నికల్లో పార్టీ ఓడిపోయినంత మాత్రాన నియోజకవర్గంలో ఏ ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదని, వారికి అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తూమాటి మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించిన ఇంటూరి నాగేశ్వరరావుకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో భాగంగా ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కందుకూరు నియోజకవర్గానికి స్థానిక నాయకులు ఇచ్చిన హామీల అమలుకు శక్తి వంచన లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై న్యాయబద్ధమైన పరిష్కారానికి ప్రతిపక్ష పార్టీగా తాము సహకరిస్తామని, లేదంటే పోరాటం చేస్తామన్నారు. కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వానికి పూర్తి మెజార్టీ ఉండడం వల్ల ఏమీ చేయలేని పరిస్థితి ఉందని, కానీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్రంలో ప్రభుత్వం మనుగడ సాగించే పరిస్థితి ఉంది కనుక, రాష్ట్ర సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా సాధనకు ఇదే సరైన సమయమని, ప్రత్యేక హోదా డిమాండ్‌ను కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వం పెట్టాలని కోరారు. రాష్ట్ర హక్కుల కోసం ఎంపీలంతా శక్తి వంచన లేకుండా పోరాడాలని, మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలుకు వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే ప్రజల పక్షాన నిలబడి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. గతంలో కందుకూరు నియోజకవర్గానికి తాము ఇచ్చిన హామీలను అమలు చేశామని వివరించారు. రామాయపట్నం పోర్టు, ఇండోసోల్ పరిశ్రమ, నిమ్జ్, తెట్టు వద్ద ఎయిర్ పోర్టుకు భూసేకరణ వంటి పనులు చేయగలిగామని వివరించారు. వీటిని పూర్తి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే పని చేయాలని సూచించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోతే ప్రజల తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

నిరంతరం అండగా ఉంటా


పార్టీ ఓడినా నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఏ కార్యకర్త, నాయకుడు కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. రెట్టించిన ఉత్సాహంతో నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే వరకు, పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. ఇక నుంచి కార్యకర్తలకు, నాయకులకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.

జిల్లాకు జల సంక్షోభం

- అడుగంటిన సోమశిల, కండలేరు
- గడిచిన ఐదేళ్లుగా జలకళ
- ఇదే సమయానికి రెండు జలాశయాల్లో 75 టీఎంసీలు తగ్గకుండా ఉన్న పరిస్థితి
- ఈ ఏడాది 13 టీఎంసీలకు చేరిన వైనం
- ఆందోళనలో అన్నదాతలు

జిల్లా జలనిధులు సోమశిల, కండలేరు జలాశయాలు అడుగంటాయి. రెండు రిజర్వాయర్ల కింద దాదాపు 10 లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన జలాశయాలు తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో డెడ్ స్టోరేజీకి పడిపోయాయి. గడిచిన ఐదేళ్లుగా రిజర్వాయర్లు జలకళతో తొణికిసలాడాయి. ఏటా రబీ సీజన్‌తో పోటీ పడి ఖరీఫ్ సాగు జరుగుతుండేది. గడిచిన ఐదేళ్లు ఖరీఫ్ సీజన్ సమయానికి కూడా 75 టీఎంసీలు తగ్గకుండా నిల్వలు ఉండేవి. ఈ ఏడాది రబీ సాగు విస్తీర్ణం తగ్గిపోగా, ఖరీఫ్ పూర్తిగా సాగు లేకుండా పోయింది.

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో ప్రధాన నీటి వనరులు సోమశిల, కండలేరు, కలిగిరి రిజర్వాయర్ల నీటి మట్టం కనిష్టానికి పడిపోయాయి. ఈ రెండు జలాశయాల కింద సుమారు 10 లక్షల ఎకరాలకు పైగా కేవలం వరి సాగు జరుగుతుండగా మరో 1.50 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు జరుగుతున్నాయి. ఇక పెన్నా డెల్టా పరిధిలో బోర్ల కింద లక్ష ఎకరాల వరకు సాగు జరుగుతోంది. 2019 ఏడాదికి ముందు ఐదేళ్లు తీవ్ర వర్షాభావంతో కరువు విలయతాండవం చేసింది. మూడేళ్లు అడపాదడపా వర్షాలు కురిసినా.. రిజర్వాయర్లకు 30..40 టీఎంసీలు స్థాయి దాటలేదు. రెండేళ్లు అయితే ఈ రెండు రిజర్వాయర్లు జలాశయాల్లో నీటి మట్టం డెడ్ స్టోరేజీలోనే ఉండేవి. సాగు విస్తీర్ణం అయితే రబీ సీజన్‌లోనే ఏకంగా నాలుగైదు లక్షల ఎకరాలకు పడిపోయింది.



సోమశిల జలాశయం ప్రస్తుత నీటి నిల్వ

గడిచిన ఐదేళ్లు నిండు కుండల్లా..

2019 సంవత్సరం నుంచి పుష్కలంగా వర్షాలు కురవడంతో సోమశిలతో పాటు కండలేరు జలాశయాలు నిండుకుండాల్లా మారితే.. దశాబ్దం పాటు నీరు పారుదల లేని పెన్నానది వరుసగా ఐదేళ్లు పరవళ్లు తొక్కింది. ఈ ఐదేళ్లకు ముందు భూగర్భ జలాలు సైతం పాతాళానికి పడిపోతే.. ఈ ఐదేళ్లు 10 అడుగుల లోతులోనే ఉండే విధంగా భూగర్భ జలమట్టాలూ పెరిగాయి. గతంలో జిల్లాలో రబీలో నాలుగైదు లక్షల ఎకరాల్లో.. ఖరీఫ్‌లో 2 లక్షల ఎకరాల్లోనే సాగు జరిగేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఏటా రబీలో పది లక్షల ఎకరాల్లో పంటలు పుష్కలంగా పండాయి. రబీతో పాటు ఖరీఫ్‌లో రెండేళ్లు పోటీ పడి సాగు చేసినా.. ఆ తర్వాత దాదాపు 5 లక్షల ఎకరాలకు తగ్గకుండా సాగు చేపట్టారు. గత రబీ సీజన్ నాటికి సోమశిలలో 50 టీఎంసీలు, కండలేరు 45 టీఎంసీలు ఉండడంతో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఐఏబీలో తీర్మానం మేరకు సాగునీటిని విడుదల చేశారు. అయితే గతం కంటే కొంత మేర సాగు విస్తీర్ణం తగ్గినా.. ఎక్కడా ఎకరం పంట ఎండకుండా నీటిని అందించడంతో జలవనరుల శాఖ అధికారులు శ్రద్ధ చూపారు.

ఈ ఏడాది ఖరీఫ్‌కు కష్టం

గతానికి భిన్నంగా ఈ ఏడాది జిల్లాలో రెండో పంట (ఖరీఫ్)కు విరామం ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక బోర్ల కింద ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ఉన్నతాధికారులు ప్రకటన విడుదల చేశారు. ఇంతటి నీటి ఇబ్బందులు రావడానికి ప్రధాన కారణం గతేడాది ఆశించిన రీతిలో వర్షాలు కురవకపోవడం, నెల్లూరు జిల్లాకు శ్రీశైలం నుంచి రావాల్సిన కృష్ణా జలాలు రాకపోవడం, అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టకపోవడం ప్రస్తుత నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి కనిపిస్తోంది. సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గతేడాది ఈ సమయం (ఖరీఫ్)లో 30 టీయంసీల నీరు నిల్వ ఉంది. రబీ నాటికి దాదాపు 50 టీఎంసీలకు చేరుకుంది. కండేలేరులో దాదాపు 30 టీఎంసీలు ఉన్నాయి. ఈ ఏడాది ఇదే సీజన్‌లోకు సోమశిల 7.7 టీఎంసీలకు, కండలేరులో 6 టీఎంసీలకు పడిపోయాయి. దీంతో ఈ ఏడాది రెండో పంటకు నీరు లేక సాగుకు విరామం ప్రకటించక తప్పలేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి కలిగింది. సోమశిల జలాశయం నీటి నిల్వ కనిష్టానికి పడిపోయింది. కేవలం తాగునీటి అవసరాలకు వినియోగించుకొనే పరిస్థితి ఉండగా వచ్చే నెలలో ఎండ తీవ్రత మరింత అధికంగా ఉండే పరిస్థితి. ఈ నేపథ్యంలో నీటి ఇబ్బందులు జఠిలమయ్యే ప్రమాదం ఉంది. చెరువులు, కుంటలు వాగులు నీరు లేక ఎండిపోవడం కారణంగా ఆత్మకూరు, ఉదయగిరి, మర్రిపాడు, వింజమూరు, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం, వరికుంటపాడు ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటి సాగులో ఉన్న బత్తాయి, నిమ్మ, బొప్పాయి పంటలు ప్రశ్నార్థకంగా మిగులుతున్నాయి. పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రాసం, నీరు లేక కొన్ని చోట్ల మూగజీవాలను అమ్ముకుంటున్నారు.

పాడి పంటలు సాగుకు సూచన

నీటి ఇబ్బందులు ఉన్నందున అందుకు అనుగుణంగా రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది. ఈ సీజన్‌లో ఆరుతడి పంటలు జొన్న, సజ్జ, మొక్కజొన్న, మినుము, అలసంద, వేరుశనగ, నువ్వులు, పెసర, నువ్వులు తదితర పంటలు సాగు చేసుకోవాలని ప్రకటించారు. ఈ పంటలకు నీటి ఖర్చు 5 నుంచి 6 రెట్లు తక్కువగా ఉంటుందని, సాగు ఖర్చులు తక్కువ ఆదాయం మాత్రం వరికి సమానంగా లేదంటే ఎక్కువ వచ్చే వీలు ఉంటుందని చెబుతున్నారు. అయితే సాగుపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. నీటి ఇబ్బందులపై క్షేత్రస్థాయి అవగాహన కలిగించాల్సి ఉంది.

క్లుప్తంగా

కంటైనర్ లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఒకరి మృతి
- ఏడుగురికి గాయాలు



ధ్వంసమైన ఆర్టీసీ బస్సు ముందు భాగం

కావలి: కావలి మండలం మద్దూరుపాడు సమీపంలో కంటైనర్ లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లాకు చెందిన తుంపాటి చెన్నయ్య (48) అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఏడుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మార్కాపురం నుంచి గురువారం రాత్రి 10 గంటల సమయంలో 45 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు కావలికి బయలుదేరింది. అందులో ప్రకాశం జిల్లా తుర్లుపాడు మండలం సీతానాగులవరం గ్రామానికి చెందిన తుంపాటి చెన్నయ్య తన భార్య వెంకటలక్ష్మి, కుటుంబసభ్యులు కోటేశ్వరి, బాలకాశితో కలిసి కావలి పాతూరులో ఉంటున్న పెద్దకుమార్తె గౌరీలక్ష్మీని చూసేందుకు బయలుదేరాడు. మద్దూరుపాడు సమీపంలోకి వచ్చే సరికి ముందు వెళ్తున్న కంటైనర్ లారీ డ్రైవర్ హఠాత్తుగా బ్రేకులు వేయడంతో వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు వేగం అదుపుకాక ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బస్సులో నుంచి కిందపడిపోయిన తుంపాటి చెన్నయ్య తలకు తీవ్రగాయ కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.మృతుడి భార్య, మరో ఆరుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కంటైనర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, ఆర్టీసీ బస్సు డ్రైవర్ మితిమీరిన వేగంతో బస్సును నడపడమే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంగం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. శుక్రవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. చెన్నవరప్పాడు మజారా గ్రామమైన జంగాలదొరువుకు చెందిన దాసరి అంకులయ్య (58)కు గురువారం కోవూరు కోర్టులో వాయిదా ఉండడంతో వెళ్లాడు. పని పూర్తయ్యాక సంగం వచ్చిన అంకులయ్య తన మోటార్‌బైక్‌పై సంగం కొండమలుపు మీదుగా వెళ్తున్నాడు. ఈ సమయంలో బైక్ అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. సుమారు గంట తర్వాత గమనించిన వాహనదారులు అంకులయ్యను 108 అంబులెన్స్‌లో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి నెల్లూరు వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. అంకులయ్యకు భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నృత్య అకాడమీ చైర్‌పర్సన్ రాజీనామా

సైదాపురం: రాష్ట్ర నృత్య అకాడమీ చైర్‌పర్సన్ పి.శిరీష యాదవ్ తన పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు సంబంధిత పత్రాన్ని ఏపీ స్టేట్ కల్టివేషన్ అండ్ కల్చరల్ కమిషన్‌కు అందజేశారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు సంవత్సరాలుగా సంగీత నృత్య అకాడమీ రాష్ట్ర చైర్‌పర్సన్‌గా అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

గూడూరు రూరల్: ఎన్నికల అనంతరం ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించి శాంతిభద్రతలకు భంగం కలిగించరాదని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. ఎవరైనా గొడవలకు దిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గూడూరు సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్లలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 162
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 284
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 314
లేయర్ చికెన్	: 204

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.77
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం

మెదడులో అల్లకల్లోలం

- జిల్లాలో ఎక్కువవుతున్న బ్రెయిన్ ట్యూమర్ కేసులు
- అవగాహన, సకాలంలో వైద్యంతో చెక్
- ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డే నేడు



నెల్లూరు(అర్బన్): మానసికంగా ప్రశాంతంగా ఉంటే శరీర ఆరోగ్యం బాగుంటుంది. అయితే మారిన పరిస్థితుల్లో ఒత్తిడితో కూడిన జీవనశైలి, రసాయన ఎరువులతో పండిస్తున్న పంటలు వినియోగించడం, కాలుష్య కారకాల వల్ల అనేకమంది బ్రెయిన్ ట్యూమర్ బారిన పడుతున్నారు. మనిషిలో కీలకమైన అవయవం మెదడు. ఇందులో ఏర్పడే కణితులు అత్యంత ప్రమా దకరం. ఇవి ఒక్కోసారి కేన్సర్‌లుగా మారొచ్చు. లేదా పక్షవాతానికి దారితీయొచ్చు. ప్రాణాంతకంగా మారే అవకాశాలు అధికం. ఈ విషయాన్ని పరిశీలించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ జూన్ 8వ తేదీని బ్రెయిన్ ట్యూమర్ డేగా ప్రకటించి వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరో సైన్సెస్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సదస్సులు నిర్వహిస్తోంది. శనివారం జిల్లాలో బ్రెయిన్ ట్యూమర్‌పై వైద్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు జరుగుతాయి.

అవగాహన పెంచుకోవాలి

మెదడులో చాలా రకాల ట్యూమర్స్‌ను వైద్యులు గుర్తిస్తున్నారు. అందులో ప్రధానంగా రెండు రకాల కణితిలుంటాయి. వీటి పట్ల అవగాహన పెంచుకుని ప్రారంభంలోనే గుర్తిస్తే మేలు. ఒక్కో దఫా ఆపరేషన్ అవసరం కూడా లేకుండా నయమవుతుంది. రేడియేషన్ వల్ల కూడా కణితులు ఏర్పడుతున్నాయి. ప్రధానంగా నేటి ఆధునిక యుగంలో సెల్‌ఫోన్‌ను గంటల తరబడి చూడడం, చేతిలో ఉండడం వల్ల కూడా ట్యూమర్లు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. రొమ్ము, పెద్దపేగు, కిడ్నీలకు కేన్సర్ సోకిన సందర్భాల్లో వారిలో 20 నుంచి 40 శాతం అవి మెదడుకు పాకి అక్కడ కూడా కేన్సర్ గడ్డలు ఏర్పడుతున్నాయని డాక్టర్లు చెబుతున్నారు.

జిల్లాలో బాధితులు

జిల్లాలో ప్రతి పదివేల మందిలో నలుగురికి బ్రెయిన్ ట్యూమర్ ఏర్పడుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. బాధితుల సంఖ్య వేగంగా పెరుగుతుతోందని అంటున్నారు. ట్యూమర్ ఏర్పడితే శస్త్రచికిత్స ద్వారా తొలగిస్తున్నారు. అలాగే ముక్కు ద్వారా ఎండోస్కోపిక్ విధానంలో ట్యూమర్లు తొలగిస్తున్నారు. నూతనంగా వచ్చిన న్యూరో నావిగేషన్ పరికరం ద్వారా తక్కువ కోతతో కణితిని డాక్టర్లు తొలగిస్తున్నారు. అలాగే కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ ద్వారా కూడా కొన్ని ప్రమాదకర కణితులను తీసేస్తున్నారు.

వ్యాధి నిర్ధారణ పద్ధతులు

మెదడులో వ్యాధిని నిర్ధారించేందుకు ఎంఆర్‌ఐ అనే స్కాన్ పరీక్షా విధానం ఎంతో ఉపయోగపడుతుంది. 1.5 టెస్లా అనే యంత్ర పరికరం ద్వారా వ్యాధిని చాలా సూక్ష్మ ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు. ఈ స్కాన్‌తో కణితి యొక్క లక్షణాలను వివరించవచ్చు. అలాగే సిటీ స్కాన్, సిటీ యాంజియోగ్రామ్ వంటి పరీక్షల వల్ల మరింత సమాచారం అందుతోంది. ఇలా పరీక్షలను చేయించుకోవడం వల్ల నాణ్యమైన, సురక్షితమైన వైద్యం రోగికి అందిత్వరగా కోలుకుంటారు.

ఇలా చేస్తే..

మెదడులో కణితులు ఏర్పడకుండా ఉండాలంటే అధిక రేడియేషన్ వెలువడే సెల్‌ఫోన్‌లు వినియోగించకూడదు. మేనరిక పెళ్లిళ్లకు దూరంగా ఉండాలి. కుటుంబంలో ఎవరికైనా బ్రెయిన్ ట్యూమర్ ఉంటే మిగిలిన వారు కూడా పరీక్షలు చేయించుకుంటే మంచిది.

గుర్తించడం ఇలా..

తలనొప్పి ఎక్కువగా రావడం, తెల్లవారుజామున నొప్పితో మేల్కోవడం, వాంతులు అవడం, చూపు మసకబారడం, ఒక వస్తువు రెండుగా కనిపించడం, చెవిలో ఎక్కువగా మోత రావడం, వాసన తెలియకపోవడం, కాళ్లు చేతులు బలహీన పడడం, నడిస్తే తూలడం, ఫిట్స్ రావడం, హఠాత్తుగా తలనొప్పితో కోమాలోకి వెళ్లడం లాంటి లక్షణాలుంటే తలలో ఏదైనా ట్యూమర్ ఉన్నట్లు భావించి డాక్టర్ వద్దకు వెళ్లాలి. అలాగే పిట్యూటరీ గ్రంథిలో ట్యూమర్ ఏర్పడితే కళ్లు మసక బారుతాయి. స్త్రీలలో నెలసరి ఆగి రొమ్ముల నుంచి అసందర్భంగా పాలు రావడం లాంటివి జరుగుతాయి. పిట్యూటరీ గ్రంథిలో ట్యూమర్ ఏర్పడితే యాక్రోమెగాలి, పిల్లల్లో జైగాంటిజమ్ అనే వ్యాధులు వస్తాయి.

వైద్య పరీక్షలు చేయించాలి



మెదడులో ఏర్పడుతున్న కణితుల విషయంలో నిర్లక్ష్యం వద్దు. తీవ్రమైన తలనొప్పి, తెల్లవారుజామున వచ్చే తలనొప్పి, నడిచే సమయంలో తూలడం, చూపు మసకబారడం లాంటి లక్షణాలను గుర్తిస్తే తక్షణమే సమీపంలోని వైద్యుని వద్దకు రోగిని తీసుకెళ్లాలి. తగిన పరీక్షలు చేయించుకోవాలి. ఒక వేళ ట్యూమర్ ఉంటే ప్రాథమిక దశలోనే పేషెంట్‌కు తొలగిస్తాం. తద్వారా సమాజం ముందుకు సాగుతోంది.

– డాక్టర్ ఏవీ రమణమూర్తి, బ్రెయిన్, స్పైన్ సర్జరీ స్పెషలిస్ట్, అపోలో ఆస్పత్రి

కండలేరులో 6.563 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.563 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీల స్వాధీనం

చిల్లకూరు: సరైన ధ్రువీకరణ పత్రాలు లేని నాలుగు లారీలను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సైదాపురం మండలం నుంచి చెన్నై వైపు వెళ్తున్న రెండు లారీలను ఆపారు. డ్రైవర్లు పత్రాలను చూపించలేకపోయారు. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే అనుమతి లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను రెవెన్యూ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

న్యాయమూర్తులకు ముగిసిన శిక్షణ

తిరుపతి లీగల్: రాయలసీమ జిల్లాల్లోని 30 మంది న్యాయమూర్తులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. రాష్ట్ర న్యాయసేవా సంస్థ ఆదేశాల మేరకు తిరుపతి మండల శాఖ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యాయమూర్తులకు శిక్షణ ఇచ్చిన ఢిల్లీ జిల్లా జడ్జి నిరజా భాటియా, కర్ణాటకకు చెందిన సీనియర్ ట్రైనర్ సుశీలను జిల్లా జడ్జి సన్మానించారు. అనంతరం జిల్లా జడ్జి భీమారావును తిరుపతి అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, జిల్లా న్యాయ సేవా సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి రవి సత్కరించారు.

ముత్యాలమ్మ ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చిల్లకూరు: తీర ప్రాంతమైన తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను శుక్రవారం ఆలయ ఆవరణలో లెక్కించారు. ఆలయ ట్రస్టు చైర్మన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం జరిగింది. రూ.30,17,383 వచ్చినట్లు తెలిపారు. అమ్మవారికి భక్తులు అందించే కానుకల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతోపాటు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామని ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, చేవూరు శ్రీనివాసులు, దువ్వూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి వ్యక్తి మృత్యువాత

వరికుంటపాడు: పిడుగుపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని యర్రంరెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. రవీంద్రబాబు (30) అనే వ్యక్తికి భార్య, పిల్లలున్నారు. అతను శుక్రవారం గేదెలకు మేత తెచ్చేందుకు పొలానికి వెళ్లాడు. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పిడుగుపడి రవీంద్రబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రాధాకృష్ణన్ ఆదర్శప్రాయుడు



రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

ఇందుకూరుపేట: మాజీ రాష్ట్రపతి, తత్త్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శప్రాయుడు అని పల్లిపాడు డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ తెలిపారు. పల్లిపాడులోని డైట్ కళాశాలలో 1984–85 బ్యాచ్ టీటీసీ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాధాకృష్ణన్ విగ్రహాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. స్వతంత్రపు భారతదేశంలో ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతిగా పని చేసిన రాధాకృష్ణన్ జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతోందన్నారు. పూర్వపు విద్యార్థులు సొంత నిధులతో ఈ మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. అనంతరం పూర్వపు విద్యార్థులు ప్రిన్సిపల్, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఆర్ బాలాజీరావు, ఎస్ శివ, విజయచంద్ర, సూపరింటెండెంట్ సురేష్, పూర్వపు విద్యార్థులు అచ్యుత, మణి, ఎస్‌కే రఫీ, విజయ్‌కుమార్, మల్లి, గిరిధర్ సింగ్, రాధిక, విజయమ్మ, బాబు రెడ్డి, పీవీ రమణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ముగియలేదా?



మద్రాస్ బస్టాండ్ వద్ద జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం



మూలాపేటలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చింది. నేతల విగ్రహాలకు వెంటనే ముసుగులు వేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. కోడ్ ముగిసినట్లు కలెక్టర్ ప్రకటించారు. అయినా ఇంత వరకు ముసుగులు తొలగించలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఇందిరాగాంధీ విగ్రహం



అలంకార్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం